క్లుప్తంగా

శంఖారావ దంపతులకు ఉగాది పురస్కారాలు



నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సుమారు 20 నిమిషాలపాటు నిర్విరామంగా ఓంకార నాదం ధ్వనించేలా శంఖాన్ని పూరించడంలో అనేక రికార్డులు సాధించి, అఖండ శంఖారావ యు'గళము'గా వాసికెక్కిన శంఖారావ దంపతులు డాక్టర్ కొండానరసింహారావు, అలివేలు మంగాదేవికి పలు సంస్థలు ఉగాది పురస్కారాలు ప్రకటించాయి. ఈ నెల 23న ఉగాది పండగను పురస్కరించుకుని చెందిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, ఐకాన్ రికార్డు సంస్థ హైదరాబాద్‌లోను, ఈ నెల 29న కాకినాడలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ వారికి ఉగాది పురస్కారాలు అందజేయనున్నాయి. డా.కొండా నరసింహారావు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

దాతలు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాలకు దాతలు సహకరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. శుక్రవారం నగరంలోని 13 డివిజన్లలో సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 దిశగా రాష్ట్రంలో 20 శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి ప్రభుత్వ, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కమిషనరు పీవీ రామలింగేశ్వర్, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి తదితరులు పాల్గొన్నారు.

పలువురు పోలీసులకు ఉగాది పురస్కారాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఆ శాఖ శుక్రవారం ఉగాది పురస్కారాలు ప్రకటించింది. జిల్లా ఏఎస్పీ ఎంబీఎం మురళీకృష్ణకు మహోన్నత సేవా పతకం, రాజమహేంద్రవరం ఏఆర్ ఎస్సై జీవీ సత్యనారాయణ, ఎయిర్‌పోర్ట్ ఏఎస్సై ఎం.శ్రీనివాసరెడ్డికి ఉత్తమ సేవా పతకలు లభించాయి. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బారావు, విజిలెన్స్ ఏఎస్పీ ఎం.స్నేహిత, టి.నాగవెంకటరాజు, రాజమహేంద్రవరం డీసీఆర్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.కనకరాజు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.సతీష్‌బాబు, ఉండ్రాజవరం ఏఎస్సై కె.రామకృష్ణ, అనపర్తి హెడ్ కానిస్టేబుల్ పి.రఘు, ఏఆర్ ఎస్సై పి.వెంకటగిరి, అగ్నిమాపక శాఖలో ఫైర్‌మన్ పి.గణేశ్వరరావు, డ్రైవర్ ఆపరేటర్ ఎల్.దుర్గాప్రసాద్, ఓఎస్‌జీసీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.కొండలరావు, ఎయిర్‌పోర్ట్ సీటీ పి.కృష్ణ, ఓఎస్‌జీసీ హెడ్ కానిస్టేబుల్ ఎన్.రాజశేఖరంలకు సేవా పతకాలు లభించాయి.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని శాటిలైట్‌సిటీ బి-బ్లాక్‌కు చెందిన నాగాల దుర్గ శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు, శాటిలైట్ సిటీ బి-బ్లాక్‌కు చెందిన 21 ఏళ్ల నాగాల రోజా రాజమండ్రి బైపాస్ రోడ్‌లోని ఓ ఫైనాన్స్ కంపెనీలో టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంది. ఆమె ప్రతి రోజు ఉదయం 8.30కు డ్యూటీకి వెళ్లి, తిరిగి రాత్రి 8 గంటలకు తిరిగొస్తుంది. ఈ నెల 17న ఉదయం 8.30 సమయంలో డ్యూటీకి వెళ్లి రాత్రి 10 గంటల వరకు తిరిగిరాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం ఆఫీసులోను, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో దుర్గ పేర్కొన్నారు. బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు

శ్యామల	:	పెళ్లికాని ప్రసాద్
సూర్య మినీ	:	కాలమేగా కరిగింది, దిల్‌రుబా
సూర్య ప్యాలెస్	:	టక్ టక్, ఎవడే సుబ్రహ్మణ్యం
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	పెళ్లికాని ప్రసాద్
అనుశ్రీ	:	శబ్దం
ఊర్వశి	:	కోర్ట్
మేనక	:	ఆర్టిస్ట్, కిస్ కిస్ కిస్సిక్
రంభ	:	షణ్ముఖ
కుమారి	:	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	:	సలార్
అశోక	:	చావా
నామవరం		
వీఎస్ మహల్	:	పెళ్లికాని ప్రసాద్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కోర్ట్
కడియం		
వెంకటసూర్య	:	కోర్ట్

వాయుదూతలు.. ప్రాణదాతలు

- సేవల్లో భేష్ అనిపించుకుంటున్న 108 సిబ్బంది
- రోడ్డు ప్రమాదాల్లో తమదైన శైలిలో సేవలు
- సకాలంలో ఆస్పత్రులకు చేరుస్తున్న ఆత్మబంధువులు
- రేయింబవళ్లూ అందుబాటులోనే..





108 అంబులెన్స్‌లో బాధితుడిని తరలిస్తున్న సిబ్బంది

కంబాలచెరువు: క్షణం విలువ ఓ ప్రాణం కావచ్చు. ఓ మరణమూ కావచ్చు. మృత్యువు ముంగిట నిలబడి.. క్షణమొక యుగంగా ఊపిరి తీసుకుంటున్న ప్రాణాన్ని.. సకాలంలో వైద్యాలయానికి చేర్చి, వారికి పునర్జన్మ కల్పిస్తున్నారు 108 వాహనం సిబ్బంది. ఎంతటి కష్టం ఎదురైనా.. అమూల్యమైన కాలాన్ని ఒడిసిపట్టి.. తమ ప్రాణాన్ని పణంగా పెట్టి.. ఆపదలో ఉన్న వారికి అపర సంజీవనులవుతున్నారు.

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 108 అంబులెన్స్‌లు రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, చాగల్లు, సీతానగరం, గోకవరం కేంద్రాలుగా సేవలందిస్తున్నాయి. వీటిలో రాజమహేంద్రవరంలో రెండు 108 అంబులెన్స్‌లు ఉండగా, రూరల్ పరిధిలో ధవళేశ్వరం, కడియం ప్రాంతాలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. వీటిలో నగరంలోని ఓ అంబులెన్స్ ఏఎల్‌ఎస్ (అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్) వాహనం ఉంది.

కీలక పాత్ర

ప్రమాదానికి గురైన క్షతగాత్రులు.. బాలింతలను ఆస్పత్రులకు తరలించడంలోను, గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో రోగిని ఆస్పత్రికి చేర్చడంలో 108 సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు. ఫోన్ రావడమే తరువాయి.. క్షణాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకుని, బాధితుడిని ఆస్పత్రిలో చేర్చే వరకు వారు ప్రాథమిక వైద్యులే. రాజమహేంద్రవరంలోని రెండు అంబులెన్స్‌లు నెలకు సుమారు 300 మంది బాధితులను ఆస్పత్రులకు చేరుస్తున్నారు. ధవళేశ్వరంలో 150, కడియంలో 140 మంది వరకు ఆ సంఖ్య ఉంది. 108 అంబులెన్స్‌లో ఓ పైలట్, మరో ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉంటారు. వీరు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు వీరి సేవలు అందుబాటులో ఉంటాయి.

ప్రమాదాల్లో..

రోడ్డు ప్రమాదాల్లో 108 సిబ్బంది సేవలు అమూల్యమైనవి. సంఘటన జరిగిన ప్రదేశాల్లో క్షతగాత్రుల ఆక్రందనలు, రక్తసిక్తమైన ప్రాంతం, వారి వద్దకు వెళ్లి అంబులెన్స్‌లో చేర్చడానికి వారు చూపుతున్న చొరవ ప్రతిఒక్కరి ప్రశంసలు అందుకుంటోంది. ఇటీవల రాజమహేంద్రవరం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో వీరు అందించిన సేవలే ఇందుకు నిదర్శనం. కొద్ది రోజుల క్రితం కాతేరు గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన సంఘటనలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడంలో కీలకపాత్ర పోషించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో సుమారు 20 మంది వరకు గాయాలపాలు కాగా, సంఘటన స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరు మృతిచెందారు. బ్రిడ్జిపై ప్రమాదం చోటుచేసుకోవడంతో ఇరువైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. మోటార్ బైక్ కూడా వెళ్లే దారి లేదు. అటువంటి సమయంలో క్షతగాత్రులను తమదైన శైలిలో పైలట్ చాకచక్యంగా ఆస్పత్రులకు తరలించి ప్రాణదాతలుగా నిలిచారు. ఇటీవల మోరంపూడి బ్రిడ్జిపై అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ బాధితుల్ని సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి కాపాడారు.

ఆ ఆనందం మాటల్లో చెప్పలేనిది



ఏదైనా ప్రమాదం కావొచ్చు. బాలింతలను తరలించడలోను, ఇతర అత్యవసర సమయాల్లోను చాలా అప్రమత్తంగా వ్యవహరించి తొందరగా ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తీవ్ర కృషి చేస్తాం. ఒక్కోసారి మా అంబులెన్స్‌లోనే బాలింతలు బిడ్డను కంటారు. ఆ సమయంలో తల్లి పడే ఆనందంతో పాటు, మేము పొందే ఆనందం మాటల్లో చెప్పలేనిది. దేవుడు మాకిచ్చిన అరుదైన సేవగా భావిస్తాం. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి ఎంత తొందరగా చేరుకుని, బాధితున్ని రక్షించి, వారి మన్ననలను పొందిన సందర్భాలు నిత్యం జరుగుతుంటాయి.

– గణేష్, 108 పైలట్, రాజమహేంద్రవరం

మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సమీక్షిస్తున్న రాహుల్‌దేవ్ శర్మ

రాజమహేంద్రవరం రూరల్: నాటుసారా, గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. శుక్రవారం ఆయన ఉత్తర, దక్షిణ ఎక్సైజ్ స్టేషన్లను సందర్శించారు. అనంతరం స్టేషన్ హౌస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రికార్డులు తనిఖీ చేశారు. నాటుసారా, బెల్టు, గంజాయి కేసుల సమాచారాన్ని ఆరా తీశారు. సారా రహిత గ్రామాలుగా మార్చడంపై సూచనలు ఇచ్చారు. నవతరం కార్యక్రమాన్ని మరింత సమర్థంగా అమలు చేయడానికి ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా సరకుల అమ్మకందారులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. నవోదయం 2.0 కార్యక్రమం, నాటుసారా మహమ్మారిని తరిమికొట్టడం, గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆధునిక సాంకేతికతను జోడించి, ప్రణాళికతో నవోదయం 2.0 ద్వారా సారా, గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా అగ్ర స్థానంలో ఉంచాలన్నారు. ఆయన వెంట జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సీహెచ్ లావణ్య తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ నాయకులు

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నిరసన

సీటీఆర్ఐ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఆమోద ముద్ర తెలిపిన చంద్రబాబునాయుడి ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు వర్గీకరణ అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చారని మండిపడ్డారు. పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. అనంతరం సమితి నాయకుడు ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి, సహజ సూత్రాలకు విరుద్ధమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. వర్గీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మత్రి బాబ్జి మాట్లాడుతూ, ఏపీ అసెంబ్లీ తీర్మానం సహజ సూత్రాలకు విరుద్ధమని విమర్శించారు. ఇది మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టే కుట్ర అని మండిపడ్డారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా వర్గీకరణ చేయడం తగదని హితవు పలికారు. ఏకసభ్య కమిషన్ గ్రామాల్లో సక్రమంగా అధ్యయనం చేయకుండా, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం, దానిపై కూటమి ప్రభుత్వం వర్గీకరణకు ఆమోద ముద్ర వేయడం సమంజసం కాదన్నారు. పట్నాల విజయకుమార్ మాట్లాడుతూ, దేశంలో అనేక రాష్ట్రాలుండగా, రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఎందుకు వర్గీకరణకు ఆమోదం తెలిపాయని ప్రశ్నించారు. ఇది రాజ్యాంగాన్ని హేళన చేయడమేనని విమర్శించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బద్దే జార్జిఆంథోని, నక్కా వెంకటరత్నం రాజు, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూరాజేంద్రప్రసాద్, ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

మనోహర్ దాస్‌పై చర్యలు తీసుకోవాలి



సెంట్రల్ జోన్ డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న నేతలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): క్రైస్తవ సమాధుల ప్రాంతంలో సిలువ వద్ద అనుచిత వాఖ్యలు చేసిన హిందూ సన్యాసి మనోహర్‌దాస్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎంఈ లూథరన్ చర్చ్ సభ్యులు శుక్రవారం దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిశోర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 10న మనోహర్‌దాస్ ధవళేశ్వరంలోని క్రైస్తవ సమాధుల వద్ద క్రైస్తవుల మనోభావాలను కించపరిచేలా దుర్భాషలాడారన్నారు. జనవరి 20న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి క్రీస్తు ఫొటోతో మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమంలో అనుచిత పోస్ట్ చేశారన్నారు. ఇటువంటి తీవ్రమైన చర్యలపై క్రైస్తవులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్ బెన్నీలింగం, క్రైస్తవ నాయకులు గుడాల జాన్సన్, కాశీ నవీన్‌కుమార్, పొన్నాల దినకర్, నల్లి శాంసన్, సునీల్‌కుమార్, శేఖర్, ఎస్ఎంఈ లూథరన్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మాతకు హారతులు



కార్యక్రమంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి, కాలభైరవ శివస్వామి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రానున్న గోదావరి పుష్కరాలు సజావుగా జరగాలన్న ఉద్దేశంతో నేడు గోదావరి నదికి అంకురార్పణ కార్యక్రమం చేపట్టినట్టు వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కాలభైరవ ఘాట్‌లో కాలభైరవ శివస్వామి ఆధ్వర్యంలో గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ, 2027లో గోదావరి పుష్కరాల ప్రారంభం వరకు గోదావరి మాతకు వివిధ ఘాట్లలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. నగర విశిష్టతతో పాటు, గోదావరి మాత పవిత్రతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఈ కార్యక్రమం చేపడతామన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం పాతికేళ్లు నిండిన సందర్భంగా వేదంలా ఘోషించే గోదావరి పాటను వంద మంది కవులు, రచయితలతో కలిసి ఆలపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ రమాదేవి, డాక్టర్ బేత శారద, డాక్టర్ సౌందర్యవతి, డాక్టర్ ఎం.భాస్కర్, డాక్టర్ పీవీబీ సంజీవరావు, మనం ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు ఇజ్జిన వినోద్‌కుమార్, సరితా రాణి, ఆర్కె లత, బర్ల సీతారత్నం, శర్వాణి శాస్త్రీయ సంగీత అకాడమీ వ్యవస్థాపకులు అనూష, పిచ్చుకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భావావేశానికి అక్షర రూపమే కవిత్వం

సీటీఆర్ఐ: కవి హృదయం చక్కని భావావేశంతో స్పందించి, అక్షరాలు ఆయుధంగా మారి కవిత్వం పుట్టుకొస్తుందని నన్నయ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళాగౌతమీ ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సమాజంలో సంఘటనలు, ప్రకృతిపై ప్రేమ, దేశభక్తి, కుటుంబ బంధాలు, స్వీయ అనుభవాలు అన్నీ కవితా వస్తువులేనన్నారు. చక్కని పదబంధాలతో భావాన్ని అల్లడమే కవి గొప్పతనమన్నారు. మహాకవులు చేసిన రచనలు ఈ కోవలోకే వస్తాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ, నన్నయ మొదలు ఈనాటి కవుల వరకు కవిత్వంలో వచ్చిన మార్పులు, రచనలపై ప్రతి విద్యార్థి ఆసక్తి కనపరచాలని కోరారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ, కత్తి కన్నా కలం గొప్పదని, కవిత్వానికి మరణం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.రాజకుమార్, పల్లి సుధా, జె.సుగుణ, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌కేవీటీ కళాశాలలో కవితా దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

ఎస్‌కేఆర్ కళాశాలలో..

స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి ప్రోత్సాహంతో కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం జరిగింది. విద్యార్థినులకు ఆంగ్ల కవితల పోటీలు నిర్వహించారు. ప్రకృతి, మహిళా సాధికారత, స్నేహం, వ్యక్తిత్వ వికాసం, చంద్రుని అందం వంటి అంశాలపై విద్యార్థినులు ఆంగ్లంలో కవితలు రాసి ప్రతిభ చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల సంస్కృత అధ్యాపకురాలు ప్రబల శ్రీవల్లి, హిందీ అధ్యాపకురాలు కె.నీరజ, కళాశాల ఆర్థిక శాస్త్ర అధ్యాపకురాలు సీవీ రామలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు పీఎస్ఎస్ఎన్ దుర్గాప్రసాద్, జీఆర్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న ఎస్‌కేఆర్ కళాశాల విద్యార్థినులు

యాత్రా స్పెషల్స్ రెడీ



రాజమహేంద్రవరం సిటీ: అరుణాచలం, రామేశ్వరం యాత్రలకు రాజమహేంద్రవరం నుంచి సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- తొమ్మిది రోజుల పాటు 14 క్షేత్రాలు దర్శించే విధంగా ఒక యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కోయంబత్తూర్, ఊటీ, మైసూర్, గురువాయూర్, త్రివేంద్రం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, తంజావూర్ ఆలయాలను దర్శించవచ్చని వివరించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం అందజేస్తామన్నారు. టికెట్లు కావాల్సిన వారు 95023 00189, 99666 66544 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ బస్సు యాత్ర వచ్చే నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతున్నారు.
- అలాగే, సువార్త యాత్ర స్పెషల్ బస్సు నడపనున్నామని షబ్నం తెలిపారు. మే 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ యాత్రను ఐదు రోజుల పాటు 8 క్షేత్రాలను దర్శించేలా నిర్వహిస్తున్నామన్నారు. నిర్మలగిరి, చెన్నై, వేళాంగిని, గుణదలలోని ఎనిమిది క్షేత్రాలను దర్శించవచ్చన్నారు.

రివెంజ్, సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆర్టిస్ట్'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరానికి చెందిన డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము నిర్మాణం చేసిన 'ఆర్టిస్ట్' చిత్రం రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం విడుదలైంది. స్థానిక అనుశ్రీ థియేటర్‌లో మార్నింగ్ షోకు ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రేక్షకులతో కలిసి ఈ చిత్రాన్ని తిలకించారు. ఎస్‌జేకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి జేమ్స్‌వాట్ నిర్మాత కాగా, రతన్ రిషి దర్శకత్వం వహించగా, సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందించారు. రివెంజ్, సస్పెన్స్, థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి సంబంధించిన విషయాలను నిర్మాత బంధువైన జ్యోతిర్మయి మీడియాకు వెల్లడించారు. నగరానికి చెందిన జేమ్స్ వాట్ నిర్మాతగా వచ్చిన ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. సంతోష్, కిషికా పటేల్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో ఇంకా పలు ప్రధాన పాత్రల్లో తనికెళ్ల భరణి, కాలకేయ ప్రభాకర్, సత్యం రాజేష్, కమెడియన్ భద్రం తదితరులు నటించారు. సినీ, కళారంగాలకు ఎంతో మంది చారిత్రాత్మక రాజమహేంద్రవరం నుంచి తెరంగేట్రం చేయగా, తాజాగా జేమ్స్ వాట్ ఈ చిత్రానికి స్వీయ నిర్మాతగా వ్యవహరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న జ్యోతిర్మయి

బాలికలకు స్వీయరక్షణ ప్రక్రియలు ముఖ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మంగాదేవి

కంబాలచెరువు: బాలికలు స్వీయరక్షణ పొందేందుకు ఆరు రకాల ప్రక్రియలను నేర్చుకోవాలని దిశ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగాదేవి తెలిపారు. స్థానిక దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం బాలికల స్వీయ రక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన మంగాదేవి బాలికల స్వీయ రక్షణపై పలు విషయాలను వివరించారు. కరాటేలో నిపుణులైన వారితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, డీఎంహెచ్ స్కూల్‌లో ప్రారంభించామన్నారు. ఎక్కడ సమస్య ఎదురైనా వ్యక్తిగతంగా సంరక్షణ పొందే విధంగా రక్షణ ప్రక్రియపై అవగాహన ఉండాలన్నారు. దశల వారీగా నగరంలోని అన్ని పాఠశాలల్లో స్వీయ రక్షణపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ బేగం, హెచ్‌సీ అలీ, హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, స్కూల్ అసిస్టెంట్ ఎల్.ప్రభాకరరావు, ఎం.లతాశ్రీ, కరాటే ఇన్‌స్ట్రక్టర్ చూప్నా, మహిళా రక్షక్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కంబాలచెరువు: మద్యం సేవించి వాహనం నడుపుతున్న కేసుల్లో ఆరుగురు వ్యక్తులకు జైలు శిక్ష విధిస్తూ ఏజేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ సి.రమ్య శుక్రవారం తీర్పునిచ్చారు. వీరిలో నలుగురికి మూడు రోజులు, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మరో పది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

వివాహం కాలేదని ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హుకుంపేట డి-బ్లాకులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, హుకుంపేట డి-బ్లాక్‌కు చెందిన ఉరిటి రామసుబ్రహ్మణ్యం(45) రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. వయస్సు పెరుగుతున్నా పెళ్లి కావడం లేదని తరుచూ బాధపడేవాడు. కొన్నిసార్లు భోజనం కూడా చేసేవాడు కాదు. కాగా గురువారం రాత్రి అతడు నిద్రించే ముందు తలుపులు వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం అతడిని నిద్ర లేపేందుకు తలుపుకొట్టగా తీయలేదని, కిటికీ నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడని అతడి తల్లి ఉరిటి వెంకటలక్ష్మి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ దర్యాప్తు చేస్తున్నారు.